క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కోడేరు: మండల కేంద్రంతో పాటు, తీగలపల్లి, మహాసముద్రం సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీ చంద్రశేఖర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ లైన్ మరమ్మతులు కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

రేపు టెంకాయలు, తైబజార్ వేలం

లింగాల: మండల కేంద్రంలోని కోదండరామాలయంలో నిర్వహించే శ్రీరామ నవమి వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఈ నెల 23న జాతర తైబజార్, టెంకాయల వేలం పాటలను నిర్వహిస్తున్నట్లు శ్రీరామ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు కంప శ్రీనివాసులు, కోశాధికారి కోనేటి వెంకటస్వామి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు కొబ్బరి కాయల వేలానికి రూ.10 వేలు, తైబజార్ వేలానికి రూ.5 వేలు డిపాజిట్ చెల్లించాలని కోరారు. గ్రామ పంచాయతీ ఆవరణలో ఉదయం 10 గంటలకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

పశువుల సంత వేలం



పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీలో గురువారం పశువుల సంత వేలం పాట నిర్వహించారు. రూ.23,200 వేలకు బొక్కలయ్య పాటపాడి దక్కించుకున్నారు. తైబజార్ వేలం పాటను శనివారానికి వాయిదా వేసినట్లు పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరు తెలిపారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ లక్ష్మణ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



కల్వకుర్తిరూరల్: పట్టణంలోని సుభాష్‌నగర్‌కు చెందిన రమేష్ గుండెపోటుతో గురువారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీజేపీ యువమోర్చా జిల్లా నాయకుడు చందుము దిరాజు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా రూ.5 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట సురేష్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ నాయకుడి జన్మదిన వేడుకలు



పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని సీఎంఆర్ గార్డెన్‌లో కొత్తపేట గ్రామానికి చెందిన జూపల్లి యువసేన నాయకుడు రాకేష్ జన్మదిన వేడుకలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎంపీటీసీ దండు నర్సింహ, మైసమ్మ చైర్మన్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి ఒకరికి గాయాలు

మన్ననూర్: శ్రీశైలం–హైదరాబాద్ ప్రధాన రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైన ఘటన గురువారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం మెదక్ జిల్లా చాపమడ గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు బైక్‌పై శ్రీశైలం పుణ్యక్షేత్రానికి వెళ్తున్నాడు. ఫరహాబాద్ సమీపంలో కోతుల గుంపు కనిపించింది. వాటిని తప్పించేక్రమంలో బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో వెంకటేశ్వర్లుకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడిని 108 అంబులెన్స్ సహాయంతో అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

అవిశ్వాస తీర్మానానికి నోటీసులు

తాడూరు: మండల కేంద్రంలోని సింగిల్‌విండో చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానానికి సంబంధించి అధికారులు నోటీసులు జారీ చేశారు. సింగిల్‌విండో చైర్మన్‌గా ప్రస్తుతం బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎండీ సమ్మద్ పాషా చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం మారడంతో మొత్తం 13 మంది డైరెక్టర్లకు గాను 9 మంది సంతకాలతో కూడిన నోటీసులను జిల్లా కోఆపరేటివ్ అధికారికి శనివారం అందజేశారు. అందజేసిన నోటీసులను పరిశీలించిన అధికారులు ఆయా గ్రామపంచాయతీల వారీగా నోటీసులు అందజేశారు. అందజేసిన నోటీసులను గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో నోటీసు బోర్డులో ఉంచాలన్నారు. ఏప్రిల్ 3న బల పరీక్ష కోసం తేదీ నిర్ణయించినట్లు తెలిపారు.

పేరుకుపోతున్న బకాయిలు

- రెడ్ నోటీసులు ఇచ్చినా స్పందన కరువు
- ఈ నెల చివరి వరకు గడువు



అచ్చంపేట మున్సిపల్ కార్యాలయం



బకాయిలను వసూలు చేస్తున్న మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్, సిబ్బంది

అచ్చంపేట రూరల్: పట్టణ అభివృద్ధి కోసం మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ఇంటి పన్నును వసూలు చేసేందుకు పాలకవర్గం తీర్మానించింది. ఇందులో భాగంగా అధికారులు, సిబ్బంది ఇంటి పన్నును వసూలు చేసేందుకు ప్రణాళికబద్ధంగా ముందుకు సాగుతున్నారు. ఈ నెల 31 వరకు ఆస్తి బకాయిలు వసూలు చేసేందుకు చర్యలు తీసుకున్నారు. కాని ఇళ్ల యజమానుల నుంచి స్పందన కరువుకావడంతో గడువులోగా టార్గెట్ చేరుకోవడం కష్టంగా మారింది. అనేక సార్లు నోటీసులు ఇచ్చినా బకాయిదారులు స్పందించడం లేదు. చివరగా రెడ్ నోటీసులు ఇచ్చినా స్పందించడం లేదని అధికారులు వాపోతున్నారు. ప్రజాప్రతినిధుల అండ, పలుకుబడితో కొందరు దాటవేసే ధోరణి అవలంభిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో మున్సిపల్ అధికారులు తలలు పట్టుకోవాల్సి వస్తుంది.

రూ. 1.16 కోటి బకాయిలు

మున్సిపల్ పరిధిలో ఆస్తిపన్ను బకాయిలు రూ. 2.84 కోట్లు ఉండగా రూ. 1.68 కోట్ల వరకు వసూలు చేశారు. రూ. 1.16 కోట్ల వరకు బకాయి ఉంది. ప్రతి ఏడాది మున్సిపల్ పరిధిలో రూ. 1.10 కోటి టార్గెట్ పెట్టుకొని వసూలు చేస్తున్నారు. బకాయిదారులకు రెడ్ నోటీసులు ఇచ్చినా స్పందించడం లేదు. ఆస్తులను జప్తు చేసైనా సరే బకాయిలను వసూలు చేయాలని మున్సిపల్ అధికారులు నిర్ణయం తీసుకున్నారు.

బడా బాబులే పన్ను ఎగవేత

మున్సిపల్ పరిధిలో పేరు ప్రతిష్టలు ఉన్న బడా వ్యాపారులు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, కళాశాల, పాఠశాలల పేరు మీద బకాయిలే ఎక్కువగా ఉన్నాయి. తమకు ఉన్న పలుకుబడితో పన్ను చెల్లించకుండా దాటవేత ధోరణిని అవలంభిస్తున్నారు. మున్సిపాలిటీ నుంచి ఎక్కువ సేవలు పొందే వారే పన్నులను చెల్లించడం లేదని మున్సిపల్ అధికారులు పేర్కొంటున్నారు.

వినూత్నంగా వసూలు

మున్సిపల్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్ ఆధ్వర్యంలో పన్ను బకాయిలను వినూత్నంగా వసూలు చేస్తున్నారు. ఎక్కువ మొత్తంలో బకాయి ఉన్న ప్రైవేటు కార్యాలయాల వద్ద మున్సిపల్ సిబ్బంది బకాయి చెల్లించాలని వినూత్నంగా నిరసన వ్యక్తం చేస్తూ బకాయిలను వసూలు చేస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళలో ఇంటి వద్దనే డబ్బులు చెల్లించే వరకు అక్కడే ఉంటున్నారు. మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్‌తో పాటు కౌన్సిలర్లు పన్నులు వసూలు చేసే సిబ్బంది గుంపులుగా వెళ్లి బకాయి ఉన్న వారి ఇంటి వద్దనే కూర్చుంటున్నారు.

బకాయిలు చెల్లించాలి



ఆస్తి పన్ను బకాయిదారులు వెంటనే పన్ను చెల్లించి సహకరించాలి. ఇప్పటికే పట్టణంలో 30 మందికి రెడ్ నోటీసులు ఇచ్చాం. బకాయిలు చెల్లించకపోతే ఆస్తులను జప్తు చేయడానికి వెనకాడం. రెడ్ నోటీసులు తీసుకున్న వారు కొందరు డబ్బులు చెల్లిస్తున్నారు. గడువులోగా బకాయిలు చెల్లించాలి.

– శ్యాంసుందర్, మున్సిపల్ కమిషనర్, అచ్చంపేట

కాంగ్రెస్‌లో చేరిన ఎంపీపీ

అమ్రాబాద్: పదర బీఆర్‌ఎస్ ఎంపీపీ బీక్యానాయక్ గురువారం అచ్చంపేటలో ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ సమక్షంలో చేరారు. అదేవిధంగా ఇప్పలపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు బన్సీలాల్, బాషానాయక్, రవిలు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హరి నారాయణగౌడ్, తదితరులు పాల్గొన్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

పాడి రైతుల నిరసన



నిరసన తెలుపుతున్న రైతులు

వెల్దండ: మండలంలోని పోతేపల్లిలో పాలబిల్లులు చెల్లించడం లేదని పాడి రైతులు గురువారం పాలకేంద్రం వద్ద నిరసన వ్యక్తం చేశారు. గ్రామంలోని రైతులు విజయ పాల కేంద్రంలో పాలుపోస్తున్న రైతులకు రెండు నెలలుగా బిల్లులు అందడం లేదని వాపోయారు. రైతులకు సకాలంలో బిల్లులు చెల్లించి ఆదుకోవాలన్నారు. కల్వకుర్తి విజయ డెయిరీ మేనేజర్ స్పందించి 10 రోజుల్లో బిల్లులు అందిస్తామని ఫోన్ ద్వారా రైతులకు హామీ ఇచ్చారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో పాడిరైతులు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి

కోడేరు: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి అన్నారు. గురువారం మండలంలోని నర్సాయిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వనజారాణి, శ్రీదేవి, బాలీశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

చారకొండ: మండలంలోని చంద్రాయన్‌పల్లి శివారులో డీఎల్ఐ కాల్వ నిర్మాణ పనుల్లో భాగంగా రోడ్డుకు ఇరువైపుల తవ్వకాలు చేపట్టారు. దీంతో ఉన్న దారిని ధ్వంసం చేయడంతో పక్కనే పెద్ద గుంత ఏర్పడింది. ప్రయాణికులు బిక్కుబిక్కు మంటూ ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది. రాకపోకలకు వీలులేకుండాపోయింది. మండలంలోని చంద్రాయన్‌పల్లి నుంచి పరిసర గ్రామాలకు శేరి అప్పారెడ్డిపల్లి, బైరాపూర్, వెల్దండ తదితర గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. రాత్రి వేళ ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణాలు కొనసాగిస్తున్నారు. ఎలాంటి సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి ప్రమాదాలకు చోటు చేసుకోక ముందే సంబంధిత అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు ప్రమాద నియంత్రణ చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.



ప్రమాదకరంగా చంద్రాయన్‌పల్లి నుంచి వివిధ గ్రామాలకు వెళ్లే రోడ్డు

ఒంటరిగానే పోటీ చేస్తాం



కల్వకుర్తిరూరల్: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బహుజన సమాజ్ పార్టీ ఒంటరిగా పోటీ చేస్తుందని ఆ పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ యేసేఫ్ అన్నారు. గురువారం పట్టణంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆంజనేయులు అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాల ప్రకారం నిరంతరం పనిచేస్తామన్నారు. రాష్ట్రంలోని 17 పార్లమెంట్ స్థానాలలో బీఎస్పీ ఒంటరిగానే పోటీ చేస్తుందని వివరించారు. పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటేందుకు కార్యకర్తలు, నాయకులు సమిష్టిగా కృషి చేయాలని కోరారు. మాజీ సీఎం కేసీఆర్ కుట్రలను దీటుగా ఎదుర్కొని బీఎస్పీ అభ్యర్థి విజయమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. సమావేశంలో ఆంజనేయులు, రమేష్‌నాయక్, రాజు, రమేష్, మహేష్, రమేష్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

వెన్నచర్ల పాఠశాల విద్యార్థుల ప్రతిభ



బహుమతి అందుకుంటున్న విద్యార్థులు

పెద్దకొత్తపల్లి: తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ లిటిల్‌ఫ్లవర్ స్కూల్‌లో నిర్వహించిన దబెస్ట్ అవుట్ ఆఫ్ వేస్ట్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. జిల్లాలోని 40 పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారు. వెన్నచర్ల ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి నాల్గో స్థానంలో నిలిచి బహుమతి పొందారు. ఈ సందర్భంగా డీఈఓ గోవిందరాజులు విద్యార్థులను అభినందించారు.

నేటి నుంచి లక్ష్మీనరసింహ్మాస్వామి బ్రహ్మోత్సవాలు



లక్ష్మీనరసింహ్మాస్వామి



ముస్తాబైన మామిళ్లపల్లి లక్ష్మీనరసింహ్మాస్వామి దేవాలయం

ఉప్పునుంతల: మండలంలో ప్రసిద్ధి చెందిన మామిళ్లపల్లి లక్ష్మీనరసింహ్మాస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 22వ తేదీ 28వ తేదీ వరకు నిర్వహిస్తునట్లు దేవస్థాన ఉత్సవ కమిటీ చైర్మన్ రాజిల్‌రావు, ఆలయం ఈఓ శ్రీనివాస్‌రావులు ఓ ప్రకటనలో తెలిపారు. మొదటి రోజు అధ్యాయనోత్సవం, అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం అవుతాయని పేర్కొన్నారు. 25న గజవాహన సేవ, రథోత్సవం ఉంటుందని వివరించారు. అదేవిధంగా 24న రాత్రి ఆర్‌జే ఈవెంట్స్ హైదరాబాద్ వారిచే డాన్స్, సాంగ్స్, మిమిక్రీ సాంస్కృతిక కార్యక్రమాలు, 25న రాత్రి సద్గురు భక్త బృంద నాట్య కళామండలి కంసానిపల్లి ఆధ్వర్యంలో బాలనాగమ్మ నాటక ప్రదర్శన, 26న కోలాటాల పోటీలు, 27న ట్రాక్టర్‌రాలీ రివర్స్, బైక్ పోటీలు, 28న బండలాగుడు పోటీలు నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు.

ఆలయ చరిత్ర...

పూర్వం రాఘవయ్య అనే బ్రాహ్మణుడు తన మామిడితోటలో ఇష్టదైవమైన దేవిమాతను ప్రతిష్టించి పూజలు చేసేవాడు. ఆ పక్కనే కొందరు రైతులు వ్యవసాయ చేస్తుండగా బయటపడిన లక్ష్మీనరసింహ్మాస్వామి విగ్రహాన్ని కూడా మామిడితోటలో పెట్టి పూజలు నిర్వహించేవారు. ఆ తర్వాత మామిడిచెట్ల మధ్యన వెలసిన ఆలయం చుట్టూ విస్తరించిన పల్లెను మామిళ్లపల్లిగా పిలుచేవారు. ఆలయానికి కొద్ది దూరంలో దుందుబీ నది ప్రవహిస్తుండటంతో దుందుబీ తీర క్షేత్రమని పిలుస్తారని పురాణాల ద్వారా తెలుస్తోంది. ఆలయ నిర్మాణ తీరులో చోళుల పురావస్తు శిల్పకళలు ఉన్నట్లు భావిస్తున్నారు.

మొక్కలు ఎండకుండా చర్యలు



మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసులు

కోడేరు: వేసవికాలంలో మొక్కలు ఎండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. గురువారం మండల కేంద్రంతో పాటు పస్పులలో నర్సరీని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మొక్కలను పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. మండలంలో మొత్తం 22 గ్రామ పంచాయతీలలో 1,93,000 మొక్కలను పెంచేవిధంగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అదేవిధంగా మొక్కలకు పందిరి అమర్చాలని సిబ్బందికి సూచించారు.

తాడూరు: మొక్కలు ఎండకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీఓ లక్ష్మణ్‌నాయక్ కోరారు. గురువారం మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న స్మశాన వాటికల గురించి చర్చించారు. తక్షణమే పెండింగ్‌లో ఉన్న స్మశానవాటికల నిర్మాణాలను పూర్తి చేయాలని సూచించారు. పల్లెప్రకృతివనంలో ఉన్న మొక్కలను ఎండిపోకుండా చూడాలని కోరారు.

పకడ్బందీగా భద్రతా ఏర్పాట్లు



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

మన్ననూర్: శ్రీశైలం–హైదరాబాద్ ప్రధాన రహదారి అటవీశాఖ సరిహద్దు చెక్‌పోస్టు వద్ద పోలీసులు గట్టి నిఘా ఏర్పాటు చేశారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని అచ్చంపేట నియోజకవర్గంలో ముఖ్యంగా మూడు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. అందులో భాగంగా మన్ననూర్ వద్ద 24 గంటలు తనిఖీలు నిర్వహిస్తున్నారు. తెలంగాణకు సరిహద్దుగా ఉండటంతో కేంద్ర బలగాలతో అమ్రాబాద్ పోలీస్ సర్కిల్‌కు చెందిన ఎస్ఐ ఖాద్రీ, పోలీసులు బాల్‌రాజ్ వాహనాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఎన్నికల నిబంధనలు అందరూ పాటించాలని అమ్రాబాద్ సీఐ శంకర్ నాయక్ అన్నారు. పోలీసులకు సహకరించాలని కోరారు.

గాలికుంటు నివారణ టీకాలు పంపిణీ

తాడూరు: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో పశువైద్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిబిరాలను రైతులు వినియోగించుకోవాలని పశు వైద్యాధికారి డాక్టర్ రాజేష్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని బలాన్‌పల్లిలో గాలికుంటు నివారణ టీకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పశువులకు సీజనల్‌గా వ్యాపించే వ్యాధులపై అవగాహన కల్పించారు. ఉచితంగా మందులను పంపిణీ చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వెల్దండ: పశువులకు సోకుతున్న సీజనల్ వ్యాధులపై రైతులు అప్రమత్తంగా ఉండాలని పశువైద్య అధికారి శ్యామ్‌సుందర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో పశువులకు గాలికుంటు నివారణ టీకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పశుసంపదను కాపాడుకుందామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది నరేష్‌రెడ్డి, రియాజ్, వెంకన్న, నరసింహ్మా, ఫణిందర్‌రెడ్డి, శ్రీను, గోపాలమిత్రలు బాలు, మొగులయ్య, సాయిబాబా, విజేందర్, విశాల్ తదితరులు ఉన్నారు.



వెల్దండలో పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

నేడు బల్మూరులో..

బల్మూర్: మండల వ్యాప్తంగా శుక్రవారం పశువులకు గాలికుంటు నివారణ వ్యాధి నిరోధక టీకాలు వేస్తునట్లు పశువైద్యాధికారి వెంకటేశ్వర్లు గురువారం ప్రకటనలో తెలిపారు.

కార్మికులకు వేతనాలు చెల్లించాలి



మాట్లాడుతున్న శివశంకర్

అచ్చంపేట రూరల్: ప్రాంతీయ ఆస్పత్రిలో పని చేస్తున్న కార్మికులకు వెంటనే బకాయి వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి, తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకుడు శివశంకర్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలో ప్రాంతీయ ఆస్పత్రిలో కార్మికులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడుతూ కార్మికులకు మూడు నెలల నుంచి జీతాలు ఇవ్వడం లేదని, వినాయక ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలన్నారు. జీఓ నంబర్ 60 ప్రకారం వేతనాలు తక్షణమే అమలు చేయాలని, కార్మికుల జీతాల చెల్లింపులో అలసత్వం వహించవద్దన్నారు. సూపరింటెండెంట్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కలెక్టర్, డీఎంహెచ్‌ఓకు ఫిర్యాదు చేస్తామన్నారు. సమస్య పరిష్కరించని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మికులు శ్రీను, వెంకటయ్య, రామకృష్ణ, రాజు, లక్ష్మణ్, పద్మ, ఆశమ్మ, చెన్నమ్మ, శ్రీదేవి, బాలింగమ్మ, జయమ్మ, బాలమణి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పదో తరగతి పరీక్షలు

పెంట్లవెల్లి: మండల కేంద్రంతో పాటు జటప్రోల్ పరీక్ష కేంద్రాల్లో గురువారం 10వ తరగతి ఆంగ్లం పరీక్ష ప్రశాంతంగా కొనసాగిందని ఎంఈఓ చంద్రు నాయక్ తెలిపారు. అదేవిధంగా మొత్తం విద్యార్థులు జటప్రోల్ 95, పెంట్లవెల్లిలో 102 విద్యార్థులు వందశాతం హాజరయ్యారని పేర్కొన్నారు. విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించామని వివరించారు. అదేవిధంగా పరీక్ష కేంద్రాల దగ్గర బందోబస్తు ఏర్పాట్లు చేశామని ఎస్ఐ రామన్‌గౌడ్ తెలిపారు.



పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

ఆడపిల్లలను ఎదగనిద్దాం



అవగాహన కల్పిస్తున్న మాట్లాడుతున్న రేణుక

చారకొండ: సమాజంలో ఆడపిల్లలను ఎదగనిద్దామని మహిళ ఎంపవర్‌మెంట్ అధికారి రేణుక అన్నారు. గురువారం మండల కేంద్రంలో అంగన్‌వాడీ కేంద్ర–5లో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడ పిల్లలను బాగా చదివించాలని సూచించారు. బాలురతో సమానంగా బాలికలను చూడాలని కోరారు. బాలికల విద్య, వైద్యం, భద్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ వెంకటమ్మ, ఆయా మంజుల, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

బెల్టు దుకాణాలపై దాడులు

బల్మూర్: అక్రమంగా మద్యం విక్రయించొద్దని ఎస్ఐ బాల్‌రాజు అన్నారు. గురువారం మండల కేంద్రంలో పోలీసులు బెల్టు దుకాణాలపై దాడులు నిర్వహించారు. అక్రమంగా మద్యం విక్రయిస్తూ రాములు అనే వ్యక్తి పట్టుబడ్డాడు. అతని వద్ద నుంచి 23 బీరు సీసాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ ఎవరైనా అనుమతులు లేకుండా బెల్టు దుకాణాలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాడుల్లో పోలీసు సిబ్బంది ఉన్నారు.

వ్యక్తి అదృశ్యం: కేసు నమోదు



అదృశ్యమైన రేణయ్య(ఫైల్)

తెలకపల్లి: వ్యక్తి అదృశ్యమైన ఘటనపై గురువారం కేసు నమోదైంది. ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కార్వంగ గ్రామానికి చెందిన బ్యాగరి రేణయ్య(39) ఫిబ్రవరి 3న కూలీకి వెళ్తున్నానని ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఎంతకీ తిరిగి రాలేదు. ఎక్కడ వెతికిన ఆచూకీ లభించలేదు. దీంతో రేణయ్య భార్య బ్యాగరి పుష్పలత గురువారం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.